క్లుప్తంగా

లీగల్ ఎయిడ్ క్లినిక్ ఏర్పాటు



లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న మూడో అదనపు జిల్లా జడ్జి ఆనంది

కాకినాడ లీగల్: సైనిక కుటుంబాలకు సూచనలు, సలహాలతో పాటు న్యాయం అందేలా లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ఏర్పాటు చేశామని కాకినాడ మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, మూడో అదనపు జిల్లా జడ్జి జి.ఆనంది అన్నారు. సోమవారం కాకినాడలో కోర్టు ఆవరణలోని మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను జిల్లా జడ్జి ఆనంది ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ సైనిక కుటుంబ సభ్యులు న్యాయపరమైన సూచనలు, సలహాలు క్లినిక్ ద్వారా పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమాధికారి ఎస్‌కే నవాబ్ జాన్, మాజీ సైనిక ఉద్యోగులు, ప్యానల్ న్యాయవాదులు పి.సతీష్‌కుమార్, పీఎల్‌వీ అబ్దుల్ పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో నేడు వేదపరిషత్తు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన శ్రీబాలత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం 27వ వేద పరిషత్తు నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ గ్రంధి సత్యరామకృష్ణ తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాల పరిధిలోని వేద సభ నిర్వహించి వేదపండితులను సత్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా లోక కల్యాణార్థం హిందూ సంస్కృతి, సంప్రదాయానుసారం చతుర్వేద పారాయణ, వేద స్వస్తి నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వేదపరిషత్తు చైర్మన్ డాక్టరు చందలాడ అనంతపద్మనాభం, ఘనాపాఠీలు పాల్గొన్నారని తెలిపారు.

విద్యార్థులకు వచన కవిత పోటీలు

బోట్‌క్లబ్: ఉభయగోదావరి జిల్లాలోని విద్యార్థులకు వచన కవితా పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అద్దేపల్లి రామ్మోహనరావు సాహిత్య విమర్శ పురస్కార సభ సెప్టెంబర్ 7న కాకినాడ రోటరీ క్లబ్‌లో నిర్వహిస్తారన్నారు. ప్రముఖ కవిత్వ విమర్శకులు రెంటాల వెంకటేశ్వరరావుకు పురస్కార ప్రదానం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులకు వచన కవిత పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఏదైనా సామాజిక అంశంపై వచన కవిత్వం రాయవచ్చని తెలిపారు. ఈ పోటీలు ఉభయ గోదావరి జిల్లాలోని జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులు అర్హులన్నారు. చక్కని కవితలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఉంటాయన్నారు. ఈ నెల 31లోపు కవితలను యూనీకోడ్‌లో టైప్ చేసి 9492164193 నంబర్‌కు వాట్సప్‌లో మాత్రమే పంపాలన్నారు. ఇతర వివరాలకు అద్దేపల్లి ఉదయ భాస్కర రావు 9949174059 సంప్రదించాలన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తప్పనిసరి

కొత్తపల్లి: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని నాగులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సౌజన్య అన్నారు. మండలంలోని పొన్నాడ శివారు శీలంవారిపాలెంలో సీజనల్ వ్యాధులపై సోమవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. సీజనల్ వ్యాధులపై తీసుకోవలసిన జాగ్రత్తలపై రోగులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ, జ్వరాలు ఎక్కువగా ఉన్న గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షం కారణంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మూలపేట, కోనపాపేటలో కూడా వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు.

మానసిక రోగి ఆత్మహత్యాయత్నం

సామర్లకోట: మానసిక సమస్యలతో బాధపడుతున్న ఓ మహిళ ఆత్మహత్యకు ప్రయత్నించడంతో ట్రాఫిక్ పోలీసులు ఆమెను రక్షించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. స్థానిక సీఐ ఎ కృష్ణభగవాన్ కథనం ప్రకారం సోమవారం స్థానిక రైల్వే గేటు వద్ద విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు రైలు కింద పడేందుకు ప్రయత్నిస్తున్న పోలవరపు నూకరత్నంను గుర్తించి అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తీసుకువచ్చారన్నారు. నూకరత్నం కుటుంబ సభ్యులకు సమాచారం అందించి స్టేషన్‌కు వచ్చిన వారితో నూకరత్నం పరిస్థితిని అడిగి తెలుసుకున్నట్టు సీఐ చెప్పారు. మానసిక సమస్యలతో ఆమె బాధపడుతోందని, చికిత్స చేయిస్తున్నామని వారు చెప్పారని సీఐ తెలిపారు. కుటుంబ సభ్యులకు ఆమెను అప్పగించామని సీఐ తెలిపారు.

అధికారులకు సత్కారం

కొత్తపల్లి: మండలంలో ఉత్తమ సేవా అవార్డు పొందిన అధికారులను సోమవారం వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. తహసీల్దార్ చిన్నారావు, ఏఈ శ్రీనివాసును శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, రావు చిన్నారావు, సర్పంచ్‌లు పొలాని దొరబాబు, చిన్నారావు తదితరులు ఉన్నారు.

పొంచి ఉన్న వ్యాధుల ముప్పు

- తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు
- ముంపు నీటిలోనే పల్లపు ప్రాంతాలు
- కాకినాడ సిటీ, రూరల్‌లో అధ్వానంగా పారిశుధ్యం
- పండూరు వాటర్ స్కీమ్ నుంచి కలుషిత జలాలు



కాకినాడలో హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ ఎదురుగా అపరిశుభ్రంగా గుడారిగుంట మార్గం



కాకినాడ రూరల్ వలసపాకల జంక్షన్ వద్ద నీరు పారే మార్గం లేక కూడలిలో నిలిచిన వర్షపు నీరు

కాకినాడ రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో వానలు విస్తారంగా కురుస్తున్నాయి. రెండు రోజులుగా వాతావరణం చల్లగా మారింది. ఆదివారం రోజంతా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం సోమవారం మాత్రం కాస్త ఉపశమనం కలిగించింది. మరో రెండు రోజుల పాటు తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో కాకినాడలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో కాకినాడ నగరం, రూరల్ మండల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

అధ్వానంగా పారిశుధ్యం

భారీ వర్షాలు కురిసినప్పుడు ముంపు నీరు తరలిపోయే మార్గం సక్రమంగా లేకపోవడంతో పలు ప్రాంతాల్లో ఎక్కడికక్కడ మురుగు, వర్షపు నీరు నిల్వ ఉంటోంది. ముఖ్యంగా డ్రెయినేజీలు పూడికతో నిండిపోవడం, చెత్తా చెదారం ఉండడంతో పారిశుధ్యం అధ్వానంగా మారుతోంది. వర్షాకాలంలో సీజన్ వ్యాధులు, అంటువ్యాధులు ఎక్కువగా వ్యాపించే అవకాశం ఉంది. తుఫాన్ ప్రభావంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. కాకినాడ నగరంలో పలు ప్రాంతాల్లో చెత్తను రోడ్ల పక్కన వేసి అనధికార డంపింగ్ యార్డులు మార్చి వేస్తుండడంతో దుర్గంధం వెదజల్లుతోంది. డెయిరీ ఫారం సెంటరు సమీపంలో కొత్తగా కూరగాయల హోల్‌సేల్ మార్కెట్ వద్ద రోడ్డు పక్కన చెత్తను వేయడంతో గుడారిగుంట వైపు వెళ్లే వారు ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తోంది. గుడారిగుంటతో పాటు పలు ప్రాంతాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. రూరల్ మండలంలోని పలు గ్రామాల్లోని వీధుల్లో వర్షపు నీరు నిల్వ ఉండిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వలసపాకల సెంటరు నుంచి ఆర్టీఓ కార్యాలయం వైపు వెళ్లే మార్గంలో కూడలిలో నీరు నిలిచిపోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. సంతోషనగర్ రోడ్డుపై కొద్దిపాటి చినుకులతో సిమెంట్ రోడ్డు జలమయంగా మారుతోంది. నగరంలో పబ్లిక్ హెల్త్ అధికారులు, రూరల్‌లో పంచాయతీల సిబ్బంది, మండల పరిషత్ అధికారులు పారిశుధ్యం మెరుగుదలకు ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది.

భయపెడుతున్న పండూరు వాటర్ స్కీమ్

రూరల్ మండల ప్రజల దాహార్తిని తీర్చే పండూరు వాటర్ స్కీమ్ నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో శుద్ధి చేయకుండానే గోదావరి జలాలను తాగునీటి కోసం సరఫరా చేస్తున్నట్టు విమర్శలు వస్తున్నాయి. పూర్తిస్థాయిలో శుద్ధి చేయకుండా పంపింగ్ చేయడంతో కుళాయిల ద్వారా రంగు మారి బురదతో కూడిన కలుషిత జలాలు వస్తున్నాయి. ప్రస్తుతం బురద రంగులో వస్తున్న తాగునీటితో అతిసార, నీటి సంబంధిత రోగాలు ప్రబలే ప్రమాదం ఉందని పల్లె ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తిమ్మాపురం మారుతినగర్‌లో కుళాయిల నుంచి బురద రంగులో నీరు వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకుంటున్నాం. తుఫాన్ హెచ్చరికలు రావడంతో పల్లపు ప్రాంతాలు, కాలనీల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవడంతోపాటు క్లోరినేషన్ కోసం బ్లీచింగ్ సిద్ధంగా ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించాం. పారిశుధ్యం మెరుగుదలకు గ్రామాల్లో పర్యటిస్తున్నాం.

– సీతారామాంజనేయులు, ఈఓ. పీఆర్అండ్ఆర్డీ, కాకినాడ రూరల్

సంస్కృత భాషాభివృద్ధికి సమష్టి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న నూతన ప్రధాన కార్యదర్శి కిరణ్

బోట్‌క్లబ్: సంస్కృత భాషాభివృద్ధికి సమష్టిగా కృషి చేస్తామని వేణుగోపాల సంస్కృత ప్రచార సభ నూతన ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన పీఎస్ కిరణ్ చెప్పారు. 110 ఏళ్ల చరిత్ర కలిగిన వేణుగోపాల సంస్కృత ప్రచార సభ సర్వసభ్య సమావేశం ఈశ్వర పుస్తక భాండాగారంలో సోమవారం అధ్యక్షుడు జీవీ కృష్ణంరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారుగా కాశీభొట్ల సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడిగా జీవీ కృష్ణంరాజు, అధ్యక్షుడిగా జీవీకే వర్మ ఉపాధ్యక్షుడిగా డీవీ కృష్ణంరాజు, గంటి నాగేశ్వరరావు, పి.వెంకట్రాజు ప్రధాన కార్యదర్శిగా పీఎస్ఎస్ కిరణ్, కార్య నిర్వాహక కార్యదర్శిగా సరిపెల్ల శ్రీరామచంద్ర మూర్తి, కోశాధికారిగా చింతపల్లి సుబ్బారావు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

చిరంజీవినికుమారి సేవలు ఆదర్శనీయం



దుర్గాబాయి దేశ్‌ముఖ్ అవార్డును చిరంజీవినికుమారి కుటుంబ సభ్యులకు అందిస్తున్న నిర్వాహకులు

బోట్‌క్లబ్: సమాజ సేవా కార్యక్రమాల్లో ఎంతో ఉత్సాహంగా పనిచేసిన చిరంజీవినికుమారి ఆదర్శనీయురాలని కాకినాడ సీపోర్టు చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మెర్ల మురళీధర్ అన్నారు. ఇటీవల మృతి చెందిన ఐడియల్ కళాశాలల కరస్పాండెంట్ పి.చిరంజీవిని కుమారికి సోమవారం ఐడియల్ కళాశాలలో వారి కుటుంబ సభ్యులకు దుర్గాబాయి దేశ్‌ముఖ్ అవార్డును ఆల్ ఇండియన్ ఉమెన్స్ కాన్ఫరెన్స్ సభ్యులు అందించారు. జేఎన్‌టీయూకే ప్రొఫెసర్ ఆలపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ అవార్డు ఆమెకు ఇవ్వడం వంద శాతం మంచి నిర్ణయమన్నారు. విద్యార్థుల భవిష్యత్ కోసం నిత్యం తపనపడేవరని చిరంజీవికుమారి కుమారుడు గోపాల్, కిరణ్ అన్నారు. ఆల్ ఇండియా ఉమెన్స్ కాన్ఫరెన్స్ అధ్యక్షురాలు ఎంవీ భరతలక్ష్మి, సెక్రటరీ భానుమతి, ట్రెజరర్ పద్మజావాణి మాట్లాడుతూ చిరంజీవిని కుమారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆల్‌ఇండియా ఉమెన్స్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షురాలు వి మీనాక్షి, సభ్యులు రత్నగిరి ఉష, పెండెం శ్రీదేవి, కె పద్మజ, పి.దుర్గాంబ పాల్గొన్నారు.

గణపతి నవరాత్ర ఉత్సవాలకు శ్రీకారం



రాటముహూర్తం చేస్తున్న దేవదాయశాఖ డీసీ రమేష్‌బాబు

బోట్‌క్లబ్: ఈనెల 27 నుంచి సెప్టెంబర్ వరకూ నిర్వహించే గణపతి నవరాత్ర ఉత్సవాలకు అన్ని ఏర్పాటు చేయాలని ఆలయాల ఈవోలను ఆదేశించినట్లు దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ డీఎల్ రమేష్‌బాబు, జిల్లా దేవదాయశాఖాధికారి కనపర్తి నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం రామారావుపేట దేవదాయ శాఖ కార్యాలయంలోని సంపత్ వినాయకుడి ఆలయం వద్ద గణపతి నవరాత్రి ఉత్సవాల కోసం రాట ముహుర్తాన్ని ఆలయ అర్చకులతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం పందిరి రాటను పాతారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సూపరిండెంటెంట్ సోమరాజు ఈవో శ్రీనివాసు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కరప: గ్రామంలోని పాత వినాయకుని గుడి సెంటర్‌లో ఈఏడాది వినాయకచవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు సోమవారం పందిరిరాట ముహూర్తంతో శ్రీకారం చుట్టారు. బాల గణేష్ బాలభక్త బృందంగా ఏర్పడి ఇక్కడ 12 ఏళ్లుగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. రంగురంగుల విద్యుద్దీపాలతో పందిరిని అలంకరించి, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. పెద కొత్తూరు, పెనుగుదురు, పెద్దాపురప్పాడు, వేళంగిలో ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో పందిరిరాట పూజచేసి, వినాయక చవితి ఉత్సవాల ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

బోట్‌క్లబ్: ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన అధికారులను ఆదేశించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వచ్చే రెండు రోజుల్లో కాకినాడలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిందన్నారు. కార్పొరేషన్ అధికారులు సోమవారం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి డివిజన్‌లో నోడల్ అధికారులు, ప్రత్యేక అధికారులు తమ సిబ్బందిని సిద్ధంగా ఉంచి వర్షాల కారణంగా కలిగే సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రధాన కాలువల్లో నీరు నిలిచిపోకుండా జేసీబీలను, నీరు నిలిచే ప్రాంతాల్లో మోటార్లను అందుబాటులో ఉంచాలని అసిస్టెంట్ ఇంజినీర్లకు సూచించారు. డ్రెయినేజీ వ్యవస్థలో ఎక్కడా నీరు నిలవకుండా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చర్యలు తీసుకోవాలని, రాత్రిపూట అత్యవసర పనుల కోసం ప్రతి సర్కిల్‌లో కనీసం 10 మంది కార్మికులు, మేస్త్రీ, ట్రాక్టర్ అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. డివిజన్లలోని సచివాలయ సిబ్బంది కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ సమస్యలను నోడల్ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కె. శ్రీనివాసరావు, ఎస్ఈ పి.వెంకట్రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్ పాల్గొన్నారు.

దళిత రైతులకు న్యాయం చేయండి



ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న రైతులు

పెద్దాపురం: డివిజన్‌లోని కోటనందూరు మండలం కేఈ చిన్నాయిపాలెంలో సీలింగ్ భూములు సాగు చేసుకుంటున్న దళిత రైతులకు న్యాయం చేయాలంటూ పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో వద్ద సోమవారం జోరువానను సైతం లెక్కచేయకుండా దళిత రైతులు ఆందోళనకు దిగారు. సీపీఐఎంఎల్ లిబరేషన్ నాయకులు జనార్దన్ ఆధ్వర్యంలో ఆ గ్రామ రైతులు ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా లిబరేషన్ నాయకులు మాట్లాడుతూ ఏళ్ల తరబడిగా సాగు చేసుకుంటున్న భూములపై కబ్జాదారులు కన్నేశారని అన్నారు. ప్రస్తుతం దుక్కి దున్ని, పంట పొలాలు ఊడ్పుల సమయంలో దళిత రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. సత్వరమే అధికారులు స్పందించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

పునరుత్పత్తి ఆరోగ్యంపై అవగాహన ఉండాలి

తాళ్లరేవు: మహిళలు పునరుత్పత్తి ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని బీమా బాయి మహిళా మండలి చీఫ్ ఫంక్షనరీ వాసంశెట్టి నందివర్ధన సూచించారు. సోమవారం తాళ్లరేవు బైపాస్ రోడ్డులోని మహిళా మండలి కార్యాలయంలో మహిళలు, కౌమార బాలికలకు పునరుత్పత్తి ఆరోగ్యం, కౌమార దశలో గర్భాలు, రుతుక్రమ శుభ్రత అనే అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీహెచ్ఎ ఈవీ రత్నం, పీఎస్ఆర్ కనకాంబరం, విమల, నాగలక్ష్మి, రేవు లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

నేతాజీ విగ్రహానికి నివాళులు

యానాం: సాయుధ పోరాటం ద్వారానే దేశానికి ఆంగ్లేయుల నుంచి స్వాతంత్ర్యం సిద్ధిస్తుందని నమ్మి అసాధారణ పోరాటం చేసిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిరస్మరణీయులని ఆర్ఏఓ మునిస్వామి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఫెర్రీరోడ్డులో చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, 21 ఏళ్ల వయసులోనే స్వాతంత్రోద్యమంలో చేరిన బోస్ అజాద్ హింద్ ఫౌజ్ దళం ఏర్పాటుచేసి బ్రిటీష్ వారిని గడగడలాడించారన్నారు. సీఐ అడలరసన్, పీఆర్ఏఓ కొల్లు ప్రసాద్ పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల అందజేత



కరపలో నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న ఏఓ, ఏఎస్సై

కరప: స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం మండల భీమాభాయి మహిళా మండలి అధ్యక్షురాలు వి.నందివర్ధన ఆధ్వర్యంలో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తీసుకోవాల్సిన ఆహారం, జాగ్రతలపై అవగాహన సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధిగస్తుల పై వివక్ష చూపకుండా 2017 చట్టం ప్రకారం ప్రభుత్వ పథకాల్లో అవకాశం కల్పిస్తారని, వైద్యసేవలు అందించడం, స్వయం సేవా సంఘాల్లో సభ్యత్వం కల్పిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయం ఏఓ బీఎల్ నరసింహం, ఏఎస్సై వి.సూరిబాబు, పీహెచ్‌సీ ఏఎన్ఎం డీవీ సత్యనారాయణమ్మ తదితరులతో 35 మంది బాధితులకు ఒక్కొక్కరికీ రూ.650 విలువచేసే నిత్యావసర సరకులు, పౌష్టికాహార కిట్లను అందజేశారు. భీమాభాయి మహిళా మండలి కార్యకర్తలు అర్జునరావు, చంద్రకళ, లోవకుమారి తది తరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ బాధితులకు పోషకాహారం పంపిణీ



హెచ్ఐవీ బాధితులకు చీరలు, పౌష్టికాహార కిట్లు అందజేత

కాకినాడ రూరల్: హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం కాకినాడ సర్పవరం జంక్షన్‌లోని చేంజెస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 20 మంది హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధితులకు చీరలు, పౌష్టికాహారం కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇంటర్నేషనల్ వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ ప్రభావతి, డిస్ట్రిక్ట్ వాకర్స్ క్లబ్ గవర్నర్ సీహెచ్ నాగేశ్వరావు, రీజినల్ సెక్రటరీ శ్రీనివాస్, అన్నపూర్ణ క్లబ్ ప్రెసిడెంట్ ప్రభ, డిస్ట్రిక్ట్ సెక్రటరీ గోపాలకృష్ణ, జానకి, జోనల్ ఛైర్‌పర్సన్ జల్లి సుజాత హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధితులను అంటరానివారిగా చూడకుండా తోచిన సహాయాన్ని అందజేయాలని తెలిపారు. హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ముందుగా స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్లు ముఖ్య అతిథులు ఎయిడ్స్ బాధితులకు పౌష్టికాహారం కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో చేంజెస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.పుష్ప కుమారి, ప్రాజెక్ట్ మేనేజర్ వండా దుర్గాభవాని, అకౌంటెంట్ సూరాల శివ, పి.సునీత, గౌరి, నారాయుడు, నాగదుర్గ, గాయత్రి, పి సరోజ, సుశీల సిబ్బంది పాల్గొన్నారు.

బాలాజీ ట్రస్ట్ సేవలు స్ఫూర్తిదాయకం



లెప్రసీ రోగులకు ఆహారం పంపిణీ చేస్తున్న బాలాజీ ట్రస్ట్ సభ్యులు

బోట్‌క్లబ్: బాలాజీ ట్రస్ట్ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరి సుబ్రహ్మణ్యం, అపోలో హాస్పిటల్ వైద్యులు మనోహర్ ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం బాలాజీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కాకినాడ విముక్తి కాలనీలోని లెప్రసీ వ్యాధిగ్రస్తులకు ఆహారం పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ గునిపే బాలాజీ, ట్రస్టీ హేమలత ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ట్రస్ట్ చైర్మన్ గునిపే బాలాజీ మాట్లాడుతూ సమాజంలో సాటివారికి తనవంతు సహాయంగా సేవ చేయాలనే ఉద్దేశ్యంతో ఈ ట్రస్టు స్థాపించానని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలాజీ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి



ప్రమాదాలపై తహసీల్దార్‌తో మాట్లాడుతున్న అఖిలపక్ష నాయకులు

తాళ్లరేవు: మండలంలోని హైవేపై ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నాయకులు తహసీల్దార్ త్రినాథరావును కలిసి మాట్లాడారు. నెల రోజుల క్రితం ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాల్సిందిగా కోరుతూ వినతిపత్రం ఇచ్చామని, ఏఏ చర్యలు చేపట్టారని ప్రశ్నించారు. ఇటీవల ప్రమాదాలు మరీ ఎక్కువయ్యాయని, గడచిన నెల రోజుల్లో సుమారు పదికిపైగా ప్రమాదాలు సంభవించి 13 మంది మృత్యువాత పడ్డారని తహసీల్దార్‌కు వివరించారు. ప్రమాదాలు అధికంగా మద్యం మత్తులో జరుగుతున్నాయని వాపోయారు. పోలేకుర్రు వై.జంక్షన్ వద్ద తనిఖీలు తూతూ మంత్రంగా జరుగుతున్నాయని ఆరోపించారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ మాట్లాడుతూ, వినతిపత్రాన్ని హైవే అధికారులకు పంపించామని, ఇప్పటికే ప్రమాద నివారణా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో సీపీఎం నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, వల్లు రాజబాబు, వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి బొంతు మోహన్ తదితరులు ఉన్నారు.

మెయిన్ డ్రెయిన్లలో పూడిక తొలగించండి



చెత్తాచెదారంతో నిండిపోయిన మెయిన్ డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న సీపీఎం బృందం సభ్యులు

కాకినాడ సిటీ: రెండు రోజులోగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ముంపు పరిస్థితిని తెలుసుకోవడానికి సీపీఎం బృందం కాకినాడ నగరంలో సోమవారం వివిధ ప్రాంతాల్లో పర్యటించింది. ఈ సందర్భంగా సీపీఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు, నగర కమిటీ సభ్యులు మలక వెంకటరమణ మాట్లాడుతూ దుమ్ములపేటలో మెయిన్ డ్రెయిన్‌ను పరిశీలించగా పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోయిందన్నారు. పెరిగిన పని భారానికి అనుగుణంగా పారిశుధ్య సిబ్బందిని పెంచాల్సి ఉందని వారన్నారు. మెయిన్ డ్రెయిన్లలో పూడికలు తీయించి, ఎప్పటికప్పుడు చెత్త తొలగిస్తే నగరంలో ముంపు సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించే అవకాశం ఉందని వీరబాబు, రమణ తెలిపారు. ఈ విషయమై నగర పాలక సంస్థ అధికారులకు తెలియచేయగా వారు సానుకూలంగా స్పందించారన్నారు. ఈ కార్యక్రమంలో మేడిశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణకు హాజరైన అభ్యర్థులకు స్టీల్ వాటర్ బాటిళ్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ ప్రసాదరావు

సామర్లకోట: మండల ప్రజాపరిషత్తు, జిల్లా పరిషత్తులో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులకు వారం రోజుల పాటు నిర్వహించే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని విస్తరణ శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ కేఎస్‌వీ ప్రసాదరావు అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పుగోదావరి, అంబేద్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలోని జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టుల శిక్షణను సోమవారం ప్రిన్సిపాల్ ప్రారంభించారు. 11 జిల్లాల నుంచి 240 మందికి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మొదటి బ్యాచ్‌లో 60 మందికి శిక్షణనిస్తున్నామన్నారు. మండల పరిషత్తు, జిల్లా పరిషత్తులలో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులకు ప్రజలతో ప్రత్యక్షంగా సంబంధం ఉండదని, అయితే వారు నిర్వహించే విధులు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యాలయాల్లో విధులు నిర్వహించే సమయంలో సక్రమంగా బాధ్యతతో నిర్వహించాలన్నారు. ఫైళ్ల నిర్వాహణ, ఈ– ఆఫీసు, ప్రభుత్వ పథకాలు, కార్యాలయ నిర్వాహణను పర్యవేక్షించే బాధ్యత వీరిపై ఉంటుందన్నారు. ఎంతో అనుభవం ఉన్న ఫ్యాకల్టీలు వివిధ అంశాలపై వారం రోజుల పాటు శిక్షణనిస్తారని చెప్పారు. శిక్షణ కేంద్రంలో భోజన, వసతి సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. ప్లాస్టిక్ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా శిక్షణకు హాజరైన అభ్యర్థులకు స్టీల్ వాటర్ బాటిళ్లను ప్రిన్సిపాల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జి.రమణ, ఫ్యాకల్టీలు డి శ్రీనివాసరావు, నరేష్‌కుమార్ పాల్గొన్నారు.